ఉపమాక వెంకన్న హుండీ ఆదాయం రూ.29 లక్షల 57,600

విశాలాంధ్ర - నక్కపల్లి : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం ఉపమాక గ్రామంలో గరుడాద్రి పర్వతంపై స్వయం వ్యక్తంగా వేంచేసియున్న శ్రీ కల్కి వేంకటేశ్వర స్వామి వారి వార్షిక తిరు కళ్యాణ మహోత్సవాలు సందర్భంగా 29 లక్షల 57,600 రూపాయలు హుండీల ద్వారా ఆదాయం సమకూరినట్లు టిటిడి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎం జగన్ మోహన్ ఆచార్యులు సోమవారం సాయంత్రం తెలియజేశారు. 28 రోజులకు గాను ఈ ఆదాయం సమకూరినట్లు ఆయన తెలియజేశారు. సోమవారం ఉదయం ఆలయంలో శ్రీవారి సేవకుల ద్వారా టిటిడి విజిలెన్స్ సిబ్బంది సమక్షంలో హుండీలు తెరిచి లెక్కించడం జరిగిందని ఆయన చెప్పారు. తిరుమల లడ్డూ ప్రసాదములు అమ్మకం ద్వారా ఐదు లక్షల రూపాయలు సమకూరినట్లు ఆయిన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ వెంకటరమణ టెంపుల్ ఇన్స్పెక్టర్ కూర్మేశ్వరరావు దేవస్థానం ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలి : ఏఐవైఎఫ్

విశాలాంధ్ర - అనకాపల్లి : కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, నిరుద్యోగ భృతి 3000 రూపాయలు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో గల నెహ్రూ చౌక్ అంబేద్కర్ విగ్రహం వద్దధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వియ్యపు రాజు మాట్లాడుతూ.రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులు ఉద్యోగాలు లేక డ్రగ్స్ మత్తు పదార్థాలు మందు వ్యసనపరులై మర్డర్లు మానభంగాలు చేస్తూ వాళ్ల జీవితాలు నాశనం చేసుకుంటున్నారని దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని అధికారంలోకి రాకముందు ప్రభుత్వాలు కల్లబొల్లి మాటలు చెప్పి

అధికారంలోకి వచ్చిన తర్వాత యువతను మోసం చేస్తున్నారని అన్నారు. కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రతిసారి ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి యువతను మోసం చేస్తూనే ఉందన్నారు. మోడీ ఏ దేశం పోయిన అన్ని దేశాల కన్నా భారత దేశం ముందుకు పోతుందని అంటు న్నారు. అది నిజమే మోడీ చెప్పినట్టు నిరుద్యోగ భార తంగా ముందుకు పోతుంది అన్నారు. అలాగే ప్రతి సంవత్సరం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని అన్నారు. తక్షణమే మెగా డీఎస్సీ తో పాటు ప్రభుత్వ శాఖల్లో వివిధ ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు జి. రాధాకృష్ణ, జిల్లా అధ్యక్షులు వేమల కన్నబాబు, ఏఐవైఎఫ్ ఇలా సహాయ కార్యదర్శి జి ఫణీంద్ర కుమార్, జగదీష్, సింహాద్రి, నవీన్, సురేష్, తరుణ్,పవన్ తదితరులు పాల్గొన్నారు.

షుగర్ ఫ్యాక్టరీ వద్ద ఈ నెల 21న జరిగే మహాధర్నాని జయప్రదం చేయాలి

విశాలాంధ్ర - చోడవరం : గోవాడ సుగర్స్ వద్ద ఈ నెల 21న తలపెట్టిన మహాధర్నాని జయప్రదం చేయాలని రైతు సంఘాలు పిలుపునిచ్చాయి. ఏ.పి. రైతు సంఘం ఆధ్వర్యంలో గ్రామ గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. ఈ ప్రచారంలో పాల్గొన్న ఏ.పి. రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు మాట్లాడుతూ చోడవరం షుగర్ ఫ్యాక్టరీ లాభాల బాటలో వుండేదని, ఫ్యాక్టరీని అమ్మివేయాలనే ఉద్దేశంతో స్థానిక ఎమ్మెల్యే, ఫ్యాక్టరీ ఎండీ (మేనేజింగ్ డైరెక్టర్) కలిపి ఫ్యాక్టరీని నిరంతరంగా క్రషింగ్ నిలుపుదల చేస్తున్నారన్నారు. ఎడ్లబండతో ఫ్యాక్టరీ కి చెరుకు తీసుకుని వచ్చిన రైతుల ను నానా ఇబ్బందులు కు గురి చేస్తున్నారని, కనీసం పశువులకు నీరుగాని, గడ్డిగాని లేక ఇబ్బంది పడుతున్నారని, విపరీతంగా దోమలు కుట్టి రైతులు అనారోగ్యానికి గురవుతున్నారని

అన్నారు. ఏ.సి.రూముల్లో గడిపే ఎం.డి, ఎమ్మెల్యే కు రైతాంగం పడే బాధలు చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్ర అప్పారావు మాట్లాడుతూ ఫ్యాక్టరీని ప్రైవేట్ వ్యక్తులకి అమ్మాలని ఆలోచనతో ఒక వ్యూహంగా ఫ్యాక్టరీ ని నష్టాలు బాటలో తోసి వేస్తున్నారని గతంలో రైతులు పాలకవర్గం మీద ఎదురు దాడి చేసే సందర్భం మరలా పునరావృతం ఏర్పడతుందని అన్నారు. కట్టలు తెంచుకొన్న అవేశం తో చెరకు రైతులు ఉన్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే షుగర్ ఫ్యాక్టరీ పర్యవేక్షణ, గాడి లో పెట్టే ప్రయత్నం చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని తెలిపారు. దీని వెనుక బడా మాఫియా వ్యూహము రచిస్తున్నారన్నారు. కార్మికులు, కర్షకుల సహకారంతో నడుస్తూ, రెండు నియోజకవర్గాల్లోని 25 వేల సభ్య రైతులు, కార్మికులు, సుమారు లక్షల మంది వ్య.కా లు ఉపాధి పొందే ఫ్యాక్టరీను కాపాడుకునే బాధ్యత రైతులందరిది అని తెలియజేసారు. 21న మహా ధర్నా విజయవంతం చేసి, మన ఫ్యాక్టరీ మనం కాపాడుకోవలసిన అవసరం ఉందని, నిరాహార దీక్షకు కూడా రైతులందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఫ్యాక్టరీ రైతులు ఉన్న గ్రామాల్లో రైతు సంఘాలు వారు ప్రచారం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి సత్యనారాయణ, జిల్లా రైతు సంఘం నాయకులు శివ పాల్గొన్నారు.

మైనింగ్ మాఫియా ఆగడాలను అరికట్టండి : వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్

విశాలాంధ్ర - మునగపాక : ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతూ అధికార పార్టీకి చెందిన మైనింగ్ మాఫియా అనకాపల్లి-అచ్యుతాపురం ప్రధాన రహదారిలో వందలాది వాహనాలతో నిత్యం ప్రమాదాల మయంగా ఈ రోడ్డున తయారు చేసిందని రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ ఆరోపించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిన్నటి ఆదివారం తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకుడు లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతో ప్రాణాలు కోల్పోయిన పోలీసులు మాత్రం మాఫియాకు కొమ్ముకాస్తున్నారు తప్పించి వారిపై సరైన కఠిన చర్యలు తీసుకోవడం లేదని ఆయన అన్నారు. చనిపోయిన వారి గురించి మాఫియా

యాజమాన్యంను ప్రశ్నిస్తే ఇన్సూరెన్స్ క్లైమ్ చేసుకోమనడం ప్రాణానికి ఇచ్చే విలువ ఇదేనా అని ఆయన వాపోయారు. గత సంవత్సర 11 నెలలో జిల్లా కలెక్టర్ ని అచ్యుతాపురం మునగపాక మండలాల పెద్దలు ఈ ప్రమాదాల విషయాన్ని ఆమెకు తెలియపరిచిన సంబంధిత అధికారులు ఏ విధమైన చర్యలు చేపట్టకపోగా మాఫియాకు అండగా నిలవడం ఏంటి అని ఆయన ప్రశ్నించారు. ఈ మార్చి నెలలోనే సుమారు నాలుగు ప్రమాదాల్లో జరగ్గా అందులో ఇద్దరు పరిస్థితి నేటికీ విషమంగా ఉందన్నారు. వారిని కార్పొరేట్ ఆసుపత్రిలో చేర్పించగా సుమారు ఒక్కొక్కరికి 15 లక్షలు ఆసుపత్రి ఫీజు అవుతాయని తెలపడంతో ఆరోగ్యశ్రీని అమలు చేయాలని బాధ్యతలు కోరినప్పటికీ యాజమాన్యాలు తిరస్కరించడం ఈ కూటమి ప్రభుత్వ పనితీరును తెలియవరుస్తుందని అన్నారు. మైనింగ్ మాఫియా ఆగడాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక తహసిల్దార్ ఎస్. ఆది మహేశ్వరరావుకు ప్రసాద్ వినతపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మలసాల కిషోర్, ఆదారి గణపతి అచ్చియ్య నాయుడు,దాసరి అప్పారావు,సర్పంచ్ దిమ్మల అప్పారావు, తిమ్మరాజుపేట గ్రామ ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్,కోనపల్లి రామ్మోహ న్రావు, నరాలశెట్టి సూర్యనారాయణ, పల్లె నాయుడు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సేంద్రీయ ఉత్పత్తుల విక్రయాలు

విశాలాంధ్ర - మాకవరపాలెం : తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రతి సోమవారం ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే ఆహార ఉత్పత్తులను విక్రయించేందుకు స్టాల్ ఏర్పాటు చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి సిహెచ్ చిరంజీవి తెలిపారు. సోమవారం ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన స్టాల్లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రీయ పద్ధతిలో పండించే ఆహార ఉత్పత్తుల ద్వారా ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చు అన్నారు. మాకవరపాలెం మండలం పరిధిలో ఉన్న ప్రకృతి వ్యవసాయ గ్రామాల నుండి ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులను కొండల అగ్రహారం గిడుతురు మల్లవరం బూరుగుపాలెం లచ్చన్న పాలెం పైడిపాల బయ్యవరం ఎస్ఆర్ పేట జంగాల పల్లి జి వెంకటాపురం నగరం గ్రామాల నుండి తీసుకొని వచ్చి స్టాల్ ఏర్పాటు చేశామన్నారు.

ఏటికొప్పాక కళాకారుడిని సత్కరించిన ప్రగడ, పప్పల

విశాలాంధ్ర - యలమంచిలి : రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన వివిధత కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా ఏటికొప్పాక లక్కబొమ్మలకు ప్రత్యేక స్థానం లభించింది. ఈ నెల 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జరిగిన మహోత్సవంలో ఏటికొప్పాక కళాకారుడు పెదపాటి శరత్ సత్యనారాయణ రూపొందించిన కళాఖండాలను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అభినందించారు.యలమంచిలి మండలం ఏటికొప్పాక గ్రామానికి చెందిన పెదపాటి శరత్ ను సోమవారం మాజీ పార్లమెంటు సభ్యులు పప్పల చలపతిరావు, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, యలమంచిలి నియోజవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లాలం భవాని భాస్కర్ సత్కరించారు.

రైల్వే ట్రాక్‌ను ఢీ కొట్టిన క్వారీ లారీ సీజ్

ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వెంకటనారాయణ

విశాలాంధ్ర - అనకాపల్లి : సోమవారం తెల్లవారుజామున. పట్నంలోని విజయరామరాజు పేట అండర్ బ్రిడ్జి వద్ద మార్టూరు నుండి అనకాపల్లి పట్నం వైపుగా రాళ్లతో వస్తున్న క్వారీ లారీ నిర్లక్ష్యంగా వెళ్ళి రైల్వే ట్రాక్‌ను ఢీకొనడంతో ట్రాక్ దెబ్బతిన్న ఘటనపై జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తీవ్రంగా స్పందించారు. వారి ఆదేశాల మేరకు సంబంధిత లారీని అదుపులోకి తీసుకుని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ద్వారా ?1,01,730/- జరిమానా విధించినట్లు అనకాపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటనారాయణ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటికే అధిక లోడుతో ప్రయాణించే లారీ యజమానులను పిలిపించి, ప్రమాదాలకు కారణమైన, నిర్లక్ష్యంగా లారీలు నడిపిన డ్రైవర్లకు హెచ్చరించడం జరిగిందని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా క్వారీ లారీలు, గూడ్స్ లారీలు పై ఎన్ఫోర్స్మెంట్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని పోలీసులు తెలిపారు. అంతేకాకుండా, లారీ డ్రైవర్ల నిర్లక్ష్యం వల్ల ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇందులో భాగంగా, లారీ యజమానులు , డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించి రవాణా నిబంధనలు, రహదారి భద్రతా నియమాలు గురించి అవగాహన కల్పించనున్నారు. జిల్లా పోలీసులు ప్రజలను అప్రమత్తంగా ఉండాలని, రవాణా నిబంధనలు పాటించాలని సూచిస్తోంది. నిబంధనలను ఉల్లంఘించినవారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు అమ్మకం

విశాలాంధ్ర - నాతవరం : అనకాపల్లి జిల్లా కలెక్టర్ మరియు జిల్లా వ్యవసాయ ప్రాజెక్టు అధికారి ఆదేశాల మేరకు సోమవారం నాతవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజర్ నేచురల్ ఫార్మింగ్ ప్రకృతి వ్యవసాయ విభాగం నుండి స్టాల్ ను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ స్టాల్ నందు పండ్లు ,కూరగాయలు, చిరుధాన్యాలు అమ్మడం జరుగుతుంది. సేంద్రియ ఎరువులను మాత్రమే ఉపయోగించి ఉత్పత్తులను పండించడం జరుగుతుంది. ఎలాంటి రసాయనిక ఎరువులను వాడకుండా ప్రకృతి వ్యవసాయం ద్వారా మాత్రమే పండించిన కూరగాయలను స్టాల్ ద్వారా విక్రయించడం జరుగుతుంది. ప్రతి సోమవారం ప్రభుత్వ కార్యాలయం వద్ద ఈ స్టాల్ ను ఏర్పాటు చేస్తారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు ఎవరైనా పండించిన పంటలను ఈ స్టాల్ వద్ద అమ్ముకోవచ్చని తెలియజేయడం జరిగింది. స్టాల్ నిర్వాహకులు భవాని, సింహాచలం, నారాయణమూర్తి, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

విశాలాంధ్ర - అచ్యుతాపురం : ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, పార్టీ విధానాలను గౌరవించాలని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, యలమంచిలి నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక శిల్ప ఫంక్షన్ హాల్లో యలమంచిలి మండల, మున్సిపాలిటీ టిడిపి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ పార్లమెంట్ సభ్యులు శ్రీ పప్పల చలపతిరావు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లాలం భవాని భాస్కర్, నియోజవర్గ పరిశీలికులు బోండా జగన్నాథం హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రగడ మాట్లాడుతూ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చిన పార్టీ అండగా ఉంటుందని, అధినేత చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యలమంచిలి నియోజవర్గంపై మరింత దృష్టి సాధించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కొలుకులూరి విజయరామరాజు, జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి రాజాన సూర్య నాగేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి కాంద్రకోట చిరంజీవి, తెలుగుదేశం పార్టీ నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కౌలు రైతులకు సీసీఆర్ కార్డులు అందజేయాలి

విశాలాంధ్ర - కే.కోటపాడు : కౌలు రైతులకు సిసిఆర్ కార్డులు అందజేసి రుణ సదుపాయం కల్పించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన బాబు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎమ్మార్వో రమేష్ బాబుకు వినతిపత్రం అందజేశారు. అత్యధిక శాతం కౌలు రైతులే వ్యవసాయం చేస్తున్నారని వారికి సదుపాయాలు కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వాని దేనని అన్నారు. కూటమి ప్రభుత్వము ఎన్నికల ముందు హామీ ఇచ్చిన మేరకు కౌలు రైతు చట్టం పగడ్బందీగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎర్ర దేవుడు ముత్యాల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బస్సు బోల్తా.. 20 మందికి గాయాలు

విశాలాంధ్ర - యస్.రాయవరం : మండలంలో చిన్నగుమ్ములూరు వద్ద ధర్మవరం కోస్టల్ గోల్డ్ రొయ్యల పరిశ్రమ కు చెందిన బస్సు బోల్తా పడడంతో 20 మంది మహిళల కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం ఉదయం కోట ఊరట్ల మండలం లింగాపురంలో మహిళా కార్మికులను ఎక్కించుకుని ధర్మవరం బయలుదేరిన కోస్టల్ బస్సు అదే మండలంలో పందూరు వద్ద మరికొందరు మహిళలను ఎక్కించుకోవడం జరిగింది. ఎస్. రాయవరం మండలం చినగుమ్ములూరు వచ్చే సరికి బస్సు అద్దంకు పొగ మంచుతో నిండిపోవడంతో పాటు స్టీరింగ్ తిరగక పోవడం రోడ్డు బాగోకపోవడం ఒకసారి ప్రక్కకు వెళ్లిపోయి బోల్తా పడింది. దీంతో ఈ ప్రమాదంలోని గాయాలు అవడంతో నక్కపల్లి 30 పడకల ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అందించారు .అందులో 13 మందికి తీవ్ర గాయాలు అవ్వడంతో అనకాపల్లి ఉషా ప్రేమ్ ఆసుపత్రికి తరలించారు . అనకాపల్లిలో చికిత్స పొందుతున్న వారు వివరాలు కోట ఉరట్ల మండలం పొందూరు కు చెందిన మైనంపల్లి సత్యవతి, గొన్నాబత్తుల స్వాతి, చింతల సాయి లక్ష్మి ,ఎర్రం శెట్టి మంగ, మరి శెట్టి భారతి ,ఎస్. మహాలక్ష్మి, సారపాక సంతోషి, మర్రిశెట్టి హేమలత ,సారమ శెట్టి వరలక్ష్మి కైలాసపట్నం కు చెందిన చింతకల నూకరాజు, ఎస్. రాయవరం మండలం చిన్న గుమ్ములూరు గ్రామం చెందిన హనుమంతు లక్ష్మి ,కోసూరి తులసి, బస్సు డ్రైవర్ షేక్ సత్తార్ లు చికిత్స పొందుతున్నారు. ఈ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎల్ .రామకృష్ణ ,ఎస్సై ఏ. విభూషణరావులు తెలిపారు.

ప్రమాద సంఘటనపై హోం మంత్రి వంగలపూడి అనిత ఆరా

చిన్న గుమ్ములూరు లో జరిగిన రోడ్డు ప్రమాదం విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర హోం శాఖ వంగలపూడి అనిత ఆరా తీశారు. నర్సీపట్నం డిఎస్పి పోతురెడ్డి శ్రీనివాసరావు మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు అంతే కాకుండా కంపెనీ యాజమాన్యం ఆసుపత్రి ఎండితో మంత్రి అనిత మాట్లాడి బాధితులకు మెరుగైన వైద్యం అందించేలాగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కొందరు క్షతగాత్రులతో ఫోన్లో మాట్లాడి ధైర్యంగా ఉండాలని సూచించారు. అనకాపల్లి జిల్లా అడిషనల్ ఎస్పీ దేవి ప్రసాద్ అనకాపల్లిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు.

ప్రమాద బాధితులకు సీపీఐ నాయకులు పరామర్శ

విశాలాంధ్ర - అనకాపల్లి : రొయ్యల కంపెనీ బస్సు ప్రమాదానికి గురైన వారిని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జిల్లా సహాయ కార్యదర్శి రాజానా దొరబాబు, విద్యార్థి యువజన జిల్లా నాయకత్వం సోమవారం పరామర్శించారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజానా దొరబాబు మాట్లాడుతూ పులపర్తి సెంటర్ రొయ్యల కంపెనీ బస్సు ప్రమాదస్తు గురి కావడం వలన 23 మందికి తీవ్రమైన గాయాలతో ప్రమాదం చోటు చేసుకుంది. కొంతమందికి తలకు బలమైన గాయాలు, మరి కొంతమందికి వెన్నుపూస మెడ, చేతి ఎముక విరగడం బయటికి కనిపించని తీవ్రమైన నొప్పులతో బాధపడుతున్నారు. తక్షణమే ప్రమాదంలో గురైన వారందరికీ మెరుగైన వైద్యం అందించి, ఆ కుటుంబాలను ఒక్కొక్కరికి లక్ష రూపాయలు చొప్పున కంపెనీ యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ పరామర్శించి వాళ్లని అన్ని రకాలుగా ఆదుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ, విద్యార్థి యువజన సంఘాలు డిమాండ్ చేశారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్ర కుమార్ అఖిల భారత యువజన జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వేముల కన్నబాబు, వియ్యపురాజు, ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు జి. రాధాకృష్ణ పరామర్శించారు.

అనకాపల్లి రైల్వే అండర్ ప్రాసెసింగ్ వద్ద తప్పిన పెను ప్రమాదం

రైల్వే ఐరన్ సేఫ్టీ స్తంభాన్ని ఢీకొట్టిన క్వారీ లారీ

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి : పట్టణంలోని విజయరామరాజుపేట రైల్వే అండర్ ప్రాసెసింగ్ వద్ద భారీ ప్రమాదం తప్పింది. సోమవారం తెల్లవారుజామున భారీ స్థాయిలో రాయి లోడుతో వెళుతున్న క్వారీ లారీ రైల్వే ఐరన్ సేఫ్టీ స్తంభాన్ని ఢీకొట్టడంతో రైల్వే ట్రాక్ ఒంగిపోయింది. అయితే అదే సమయంలో అటుగా వెళుతున్న గూడ్స్ రైలు లోకో పైలట్ అప్రమత్తంతో గూడ్స్ రైలుకు పెను ప్రమాదం తప్పింది. అంతేకాకుండా ఆ వెనుకే వచ్చే గోదావరి ఎక్స్ప్రెస్ కు ఈ ప్రమాదం జరిగి ఉంటే భారీ స్థాయిలోనే ప్రారంభం జరిగి ఉండేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.విషయం తెలుసుకున్న రైల్వే సిబ్బంది హుటాహుటినఅక్కడికి చేరుకుని మరమత్తు పనులు చేపట్టారు. ఈ సంఘటన వల్ల విజయవాడ నుంచి విశాఖ వెళ్లే పలు రైళ్లకు తీవ్ర అంతరాయం కలిగింది. ఇదిలా ఉండగా సంఘటన సమాచారం తెలుసుకున్నారు సిపిఐ, ప్రజా సంఘాల నాయకులు అక్కడ చేరుకొని జరిగిన సంఘటనపై ఆరా తీశారు. సంఘటనకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వెంకటరావుకు సర్దార్ వల్లభాయ్ పటేల్ అవార్డు

విశాలాంధ్ర - సబ్బవరం : మండల కేంద్రంలోని స్థానిక జోడుగుళ్ళు కి చెందిన శ్రీ బంగారు తల్లి సేవా సమితి అధ్యక్షులు, భారత సేవారత్న అవార్డు గ్రహీత సింగంపల్లి వెంకటరావు కు 2025 సం. నకు గాను సర్దార్ వల్లభాయ్ పటేల్ అవార్డు లభించింది.ఈ సందర్భంగా మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ తొమ్మిదవ వార్షికోత్సవ వేడుకల లో వెంకటరావు ఈ అవార్డును ఆదివారం స్వీకరించారు .ఈ కార్యక్రమం లో వివిధ రాష్ట్రాలలో సమాజ సేవా కార్యక్రమాలు చేసే వారిలో కొంతమందిని గుర్తించి వారిని, సన్మానించి సత్కరించారు.వారిలో అనకాపల్లి జిల్లా, సబ్బవరం మండలం, శ్రీ శ్రీ శ్రీ బంగారు తల్లి సేవా సమితి అధ్యక్షులు సింగంపల్లి వెంకటరావు ను,మార్చి 16వ తేదీ 2025 న సర్దార్ వల్లభాయ్ పటేల్ అవార్డు తో సన్మానించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత వెంకటరావు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధులుగా పొన్నూరు ఎమ్మెల్యే దూళిపాళ్ళ నరేంద్ర, మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు తిరుమలశెట్టి ఉమా శంకర్‌లు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ సేవలలో రక్తదాన సేవలు అద్భుతమైన ప్రక్రియ అని ప్రతీ కుటుంబం లో ఒక రక్తదాత తయారు కావాలని పిలుపునిచ్చారు. రక్తదానంతో ప్రాణాలను కాపాడవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమలశెట్టి కల్పన,తాసుబెల్లి ఫౌండేషన్ చైర్మన్ శంకర్ నాయుడు,వెంకట్ మహేశ్వరి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు ముత్తంశెట్టి దుర్గా కిషోర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారానికే ప్రజా చైతన్య యాత్ర

విశాలాంధ్ర - సబ్బవరం : చైతన్య యాత్ర ప్రజా సమస్యల పరిష్కారానికి మార్గమని మండల సిపిఎం కార్యదర్శి ఉప్పాడ సత్యవతి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సిపిఎం పార్టీ చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమం లో భాగంగా మండలం లోని ప్రజా సమస్యల మీద సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచడం లేదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసమే సిపిఎం ప్రజా చైతన్య యాత్ర నిర్వహిస్తోందన్నారు. ప్రధానంగా వీధి కాలువలు,మంచినీళ్ల సమస్యల మీద ప్రజా చైతన్య యాత్ర చేసి ధర్నా తెలిపారు. అలాగే మురుగునీటిపారుదల లేకపోవడంతో ప్రజలను దోమల వెంటాడుతుందన్నారు. ప్రజల చైతన్యంతోనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ సభ్యులు మొల్లేటి గౌరేశ్వరరావు, సిపిఎం పార్టీ ముఠా యూనియన్ సభ్యులు, ఆటో యూనియన్ సభ్యులు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

విశాలాంధ్ర - పరవాడ : గొర్లివానిపాలెం పంచాయతీ పరిధి టిడ్కో గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఐద్వా జిల్లా నాయకురాలు పి.మాణిక్యం డిమాండ్ చేసారు. ఈ మేరకు సోమవారం ఐద్వా ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలంటూ టిడ్కో నివాసాల ప్రజలు ఎంపీడీవోకు, పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ టిడ్కో గృహ సముదాయంలో వీధిలైట్లు లేక అక్కడ నివశించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. చీకట్లు అలముకోవడంతో రాత్రి వేళల్లో దొంగతనాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇళ్ల మధ్యలో పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని ఆవేధన వ్యక్తం చేసారు. దోమలు విజృంబించి వ్యాధుల బారిన పడుతున్నారని, రేషన్ వాహనం రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. చోరీలు నివారించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ఈ విషయమై ఇప్పటికే పోలీస్ వారికి పిర్యాదు చేసామని తెలిపారు. అధికారులు స్పంధించి మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రజల అవసరాలను తీర్చేందుకు కృషి చేయాలని వినతిపత్రం ద్వారా అధికారులను కోరారు. వినతి పత్రం ఇచ్చిన కార్యక్రమంలో టిడ్కో గృహ పముదాయ కమిటీ సభ్యురాలు బంగారమ్మ, ఇందుమతి, సూరమ్మ, పి.లక్ష్మి, అన్నపూర్ణ తదితర మహిళలు పాల్గొన్నారు.

వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి

విశాలాంధ్ర - వి.మాడుగుల : వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని మాడుగుల ఎమ్మెల్యే తనయుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు అన్నారు. సోమవారం మాడుగులలో టీడీపీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ ఎన్నికలకు కార్యకర్తలు ఇప్పటినుండే కార్యకర్తలు కష్టపడి పనిచేసి గ్రామాలలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించాలన్నారు. కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని ఎవరు ఇటువంటి సందేహాలు మనసులో పెట్టుకోవద్దని అందరం కలిసి పనిచేసే పార్టీ అభివృద్ధికి కృషి చేద్దామని ఆయన అన్నారు. రానున్న ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేయాలని అన్నారు. కార్యకర్తలకు ఎటువంటి సమస్య ఉన్న అందరం కూర్చుని సమస్య పరిష్కారానికి కృషి చేద్దామని ఎవరికి ఇటువంటి సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకుని వస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుప్పాల అప్పలరాజు, ఉందూరు దేవుడు, వడ్డీ రాజ్ కుమార్, గొల్లివిల్లి శ్రీరామమూర్తి, పుప్పాల రమేష్, వద్దాది రంజిత్ వర్మతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు

విశాలాంధ్ర - కే.కోటపాడు : మొదటిరోజు పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని చౌడువాడ గొండుపాలెం కె కోటపాడు ఏ కోడూరు మేడిచర్ల పాతవలస కొరువాడ హై స్కూల్స్ నుండి 485 మంది పదవ తరగతి విద్యార్థులు పరీక్షలు రాయగా , ఇందులో ఇద్దరు విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదు అని ఎంఈఓ కే సత్యనారాయణ తెలిపారు. వీరందరికీ కే కోటపాడు లో రెండు కేంద్రాలు ఏ కోడూరులో ఒక కేంద్రం కేటాయించామన్నారు. ఈ పరీక్షలు ఏప్రిల్ ఒకటవ తేదీ వరకు కొనసాగుతాయని ఎంఈఓ తెలిపారు.

రేషన్ కార్డు లబ్ధిదారులందరికీ ఈకేవైసీ తప్పనిసరి

విశాలాంధ్ర - నాతవరం : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామాల్లో ఉన్న రేషన్ కార్డు లబ్ధిదారులు ఐదు సంవత్సరాలు నుండి 50 సంవత్సరాలు లోపు వయస్సు గలవారు అందరూ ఈనెల 31 వ తారీకు లోపు ఈ కేవైసీ చేయించుకోవాలని నాతవరం తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ కేవైసీ చేసుకొనని ఎడల ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందించే నిత్యవసర సరుకులు తీసుకునే అవకాశాన్ని కోల్పోతారని ప్రభుత్వం స్పష్టం చేసిందని తెలిపారు. లబ్ధిదారులందరూ మీ యొక్క చౌక దుకాణదారు అనగా డీలర్ వద్ద కు వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాల్సిందిగా తెలియజేయడం జరిగింది.

శ్రీ నూకంబిక అమ్మవారి జాతర ఏర్పాట్లను పరిశీలించిన రామ్కీ

విశాలాంధ్ర - అనకాపల్లి : ఉత్తరాంధ్రా ఇలవేల్పు అనకాపల్లి లో వెలసిన నూకంబిక అమ్మవారి దేవస్థానం కొత్త అమావాస్య జాతర పండుగను మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ కూటమి ప్రభుత్వ పెద్దల సహకారంతో రాష్ట్ర పండుగ తీర్చిదిద్దిన విషయం మనందరికీ తెలిసినదే, ఈసందర్భంగా అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చే భక్తులకు ఇటువంటి ఇబ్బంది కలగకుండా ఏ విధంగా ఏర్పాట్లు చెయ్యాలో కొణతాల రామకృష్ణ ఆదేశాల మేరకు అధికారులతో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ భీమర శెట్టి రామ్కి ఆలయ పరిసర ప్రాంతాలలో పర్యటించి అధికారులకు పలు సూచనలు చేశారు, క్యూలైన్లు, త్రాగునీరు, ప్రసాదాల వితరణ, మరుగుదొడ్లు, కేశఖండన, పార్కింగు, ఆలయ పరిసర ప్రాంతాలు పరిశుభ్రముగా ఉంచాలని ఎప్పటికప్పుడు చెత్తా చెదారం లేకుండా శుభ్రంగా ఉండాలనిఆయన తెలియజేశారు, ఎండలు తీవ్రత ఎక్కువగా ఉన్నందున క్యూ లైన్ లో ఉండే భక్తులకు త్రాగునీరు, మజ్జిగ, చిన్న పిల్లలకు పాలు ఎప్పటికప్పుడు పంపిణీ చేయాలని ఆయన ఆదేశించారు,నెల రోజులపాటు జరిగే కొత్త అమావాస్య జాతర మహోత్సవంలో ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అమ్మవారి దర్శనం చేసుకొని తిరిగి వెళ్లే విధంగా ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పండగ ప్రత్యేక అధికారిని కె.శోభారాణి, ఆలయ సహాయ కమిషనర్ ఈవో వెంపలి రాంబాబు, డిఎస్పి శ్రావణి, సిఐలు టీవీ విజయ్ కుమార్, వెంకటనారాయణ, మున్సిపల్ విద్యుత్ అధికారులు, నూకాంబికా దేవస్థానం మాజీ చైర్మన్ పీలా నాగ శ్రీను, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన పది పరీక్షలు

విశాలాంధ్ర - మాకవరపాలెం : మాకవరపాలెంలో సోమవారం పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి.మాక వరపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు తామరం కృపాకమల్ స్కూలులో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు ఉదయం 9:30 నుంచి పరీక్షలు ప్రారంభం కాగ ఎనిమిది గంటలకే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు హాజరయ్యారు. అనంతరం విద్యార్థులను తనిఖీ చేసి లోపలికి అనుమతించారు ఈ కేంద్రాల వద్ద 144 సెక్షను అమలు చేశారు.

యస్ .రాయవరం : మండలంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి .సోమవారం ఉదయం 9 గంటల ముందు విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. మండలం లోని యస్.రాయవరం, ధర్మవరం అగ్ర హారం, కొరుప్రోలు, దార్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, అడ్డరోడ్డు తిమ్మాపురం లో శ్రీ ఆదర్శ పబ్లిక్ స్కూల్లో పరీక్ష కేంద్రాల్లో తెలుగు పరీక్షకు విద్యార్థులు రాశారు. ఎటువంటి అవాంఛ నీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

31లోగా ఆధార్ ఈకేవైసీ తప్పనిసరి

విశాలాంధ్ర - చోడవరం : మార్చి 17, మండలంలోని రేషన్ కార్డుదారులు తమ కుటుంబ సభ్యులు తో ఈనెల 31 లోగా తమ ఆధార్ కార్డులు ఈ కేవైసీ చేయించుకోవాలని తహసిల్దార్ వి.రామారావు సోమవారం ఓ ప్రకటనలో తెలియజేశారు.

వాసవి యూత్ క్లబ్ అధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం

విశాలాంధ్ర - చోడవరం : పది పరీక్షలు ప్రారంభం, పొట్టి శ్రీరాములు జయంతి వేడుకల్లో భాగంగా చోడవరం శ్రీ వాసవి క్లబ్ అధ్వర్యంలో, దాతలు సహకారంతో పాత బస్టాండ్ అవరణలో కనకదుర్గ కోవెల ఎదురుగా సప్తగిరి లేడీస్ కార్నర్ వద్ద సోమవారం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. పది విద్యార్థు లకు పరీక్షల్లో అలసట, దాహం కొరకు ఓ.ఆర్.ఎస్. పంపిణి చేశారు. బాటసారులు, పాదచారులు దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఎంతగానో ఉపయోగ పడుతుందని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జెడ్.సి. కొల్లూరు మణికుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ పెన్నం రాజు, సెక్రటరీ విన్నకోట రాజేష్, ట్రెజరర్ అర్రేపు శ్రీనివాస్ వైస్ ప్రెసిడెంట్ కేతవరపు రామకృష్ణ, వి.కే.ఎస్.పి ఇన్చార్జ్ బత్తుల శ్రీనివాస్ మరియు క్లబ్ డైరెక్టర్స్ అండ్ సభ్యులు పాల్గొన్నారు. ఓ.ఆర్.ఎస్. డ్రింకులు ఇమీడియట్ పాస్ట్ ప్రెసిడెంట్ పూసర్ల కిరణ్ మజ్జిగ పంపిణీకి పెరుగు స్పాన్సర్ చేసిన వారు, వి. కృష్ణాజి, కొత్త రాజు, నూకరాజు, హరి, విజయ భాస్కర్, రంగనాథ్ లు సహకారం తో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలియజేశారు.

పాల్తేరులో వరికుప్పలు దగ్ధం

విశాలాంధ్ర - పాయకరావుపేట : మండలంలోని పాల్తేరు గ్రామంలో కంకిపూడి వెంకట్రావు శిస్తుకు తీసుకున్న పొలంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రెండు వరికుప్పలను తగల పెట్టారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేసేందుకు ప్రయత్నించగా అప్పటికే వరికుప్పలు పూర్తిగా అగ్నికి ఆహుతి అయ్యాయి. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, క్లూస్ టీం ద్వారా నేర పరిశోధన స్థలంలో దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ జి. అప్పన్న తెలిపారు.

కలిగొట్ల గ్రామంలో వైభవంగా వినాయకాయ వార్షికోత్సవం

విశాలాంధ్ర - దేవరాపల్లి : దేవరాపల్లి మండలం కలిగొట్ల గ్రామంలో సోమవారం శ్రీ శ్రీ శ్రీ వరసిద్ధి వినాయకాయ వార్షికోత్సవం వైభవంగా నిర్వ హించారు. ఈ వార్షికోత్సవం సందర్భంగా కలిగొట్ల గ్రామంలో రుత్తల వారి కళ్ళాల వద్ద సుమారు ఏడు సంవత్సరాల క్రితం శ్రీ వరసిద్ధి వినాయకాయ ఆలయ నిర్మాణం చేసి విగ్రహం ప్రతిష్ట చేసారు.అప్పటి నుండి నుండి ప్రతి సంవత్సరం ప్రతిష్ట జరిగిన రోజున వినాయకునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం 6:గంటల నుండి ప్రత్యేక పూజలు చేశారు, కలిగొట్ల గ్రామం చుట్టు పక్కల అన్ని గ్రామాల ప్రజలు సుమారు రెండు వేల మందికి అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. అలాగే సాయంత్రం ఎడ్ల పందాలు జరిపించారు.ఈ కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో రావటం జరిగింది.

రేషన్ కార్డుదారులు ఈ కేవైసీ తప్పనిసరి : తహశీల్దార్ రమేష్‌బాబు

విశాలాంధ్ర - యస్.రాయవరం : మండలంలో రేషన్ కార్డుదారులు ఈ కేవైసీ తప్పనిసరిగా చేయుంచుకొవాలని తహసిల్దార్ జె.రమేష్ బాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ కార్డులు ఉన్నవారికి ఇచ్చే రాయితీలను ఇవ్వాలంటే మార్చి 31 తేదిలోపు ఈకేవైసీని దగ్గర్లో ఉన్న రేషన్ డిపోలు,ఆధార్ కేంద్రాలు, గ్రామ రెవెన్యూ అధికారి వద్ద గాని నమోదు చేసుకొవాలని విజ్ఞప్తి చేశారు.

ఇవిఎం గొడౌను తనిఖీ చేసిన కలెక్టర్ విజయ్ కృష్ణన్

విశాలాంధ్ర - అనకాపల్లి కలెక్టరేట్ : జిల్లా ఎస్.పి. కార్యాలయం ప్రాంగణంలో గల ఇవిఎం గొడౌను ను జిల్లా కలెక్టరు మరియు జిల్లా ఎన్నికల అధికారి విజయ క్రిష్ణన్ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమ క్షంలో తనిఖీచేసారు. గొడౌను త్రైమాసిక తనిఖీలలో భాగంగా గొడౌను లో భద్రపరచిన ఇవిఎం మెషీ న్లను, సి.సి. కెమెరాలు, అగ్నిమాపక పరిక రాలను, భద్రతా ఏర్పాట్లను జిల్లా కలెక్టరు పరిశీ లించారు. ఈ కార్యకమంలో జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణరావు, అనకాపల్లి రెవిన్యూ డివిజినల్ అధికారి షేక్ ఆయిషా, ఎలక్షన్ సెక్షను సూపరిం టెండెంటు ఎస్.ఎస్.వి.నాయుడు, తెలుగుదేశం పార్టీ ప్రతినిధి బి. శ్రీనివాసరావు, ఆప్ పార్టీ ప్రతినిధి కె.హరినాథ బాబు, వైఎస్ఆర్సిపి ప్రతినిధి టి.షణ్ముఖ్, ఐఎన్ సి ప్రతినిధి మీసాల సుబ్బన్న, సి.పి.ఎం.ప్రతినిధి జి.శ్రీరామ్, అగ్నిమాపక అధికారులు పాల్గొన్నారు.

10వ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద డ్రోన్లతో నిఘా

విశాలాంధ్ర - పాయకరావుపేట : పట్టణంలో 10వ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు డ్రోన్ల సహాయంతో నిఘా ఏర్పాటు చేసినట్లు సిఐ జి.అప్పన్న తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు 144 సెక్షన్‌ను అమలు చేసామన్నారు. శ్రీ ప్రకాష్, కనోస, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాల వద్ద డ్రోన్లను వినియోగించి నిఘా పెట్టినట్లు తెలిపారు. అనుమతి లేని వ్యక్తులు పరీక్షా కేంద్రాల వద్దకు రాకుండా చర్యలు తీసుకున్నామన్నారు.

పది పరీక్షకు 1101 మంది విద్యార్థులు

విశాలాంధ్ర - చోడవరం : మార్చి 17, పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు చోడవరం లోని 6 సెంటర్లలోను 1101 మంది విద్యార్థులు సోమవారం నుండి పరీక్షలు రాస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి సింహాచలం తెలియజేశారు. గవర్నమెంట్ హై స్కూలు, జడ్పీ గర్ల్స్ హై స్కూల్, పి ఎస్ పేట, లక్ష్మవ రము, గోవాడ జడ్పీ హైస్కూల్స్, భాష్యం స్కూల్ తో కలిపి ఆరు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ప్రారంభమైన పది పరీక్షలు..పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి : పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 8:30 గంటలకే విద్యార్థులు వారికి కేటాయించిన పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు.9: 30 ప్రారంభమైన పరీక్షలు 12:45 నిమిషాల వరకు కొనసాగాయి. ఇదిలా ఉండగా పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ పరిశీలించారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదవతరగతి పరీక్షలకు విద్యార్థులు శతశాతం హాజరు అయ్యేటట్లు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రంలో ఏర్పాటుచేసిన ఆరోగ్యశిబిరం, భద్రత, విద్యార్థులకు కల్పించిన సౌకర్యాల గూర్చి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి పరీక్షలకు విద్యార్థులు అందరూ హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, అందుకు సంబంధించి మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులకు తగు సూచనలు జారీ చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి జి. అప్పారావునాయుడును జిల్లా కలెక్టరు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజినల్ అదికారి షేక్ ఆయిషా పాల్గొన్నారు.

పంచాయతీ బోర్లు.. అక్రమంగా పొలాలకు నీరు

విశాలాంధ్ర - పరవాద : తమను ఏం చేయలేరన్న ధీమాతో కొందరు బరి తెగిస్తున్నారు. ప్రభుత్వ నిధులతో ప్రజల దాహార్తి కోసం వేయించిన తాగునీటి బోరులను ప్రజలకు అందివ్వకుండా కొందరు తమ సొంత పొలానికి కట్టుకోవడమే ఇందుకు నిదర్శనం. పరవాడ మండలం పెదముషిడివాడలో కొందరు ఇదే పంథాను కొనసాగిస్తున్నారు. పంచాయతీ బోరుల్లో ఎంచక్కా పైపులు దించి, మోటార్లు బిగించి బోరు నీటిని తమ వ్యవసాయాలకు వాడుకుంటున్నారు. కొన్నేళ్లుగా ఈ పంచాయితీలో ఇదే తరహాలో నీటి చౌర్యం జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. సర్వే నెంబర్ 355 గెడ్డ వాగులోనూ, 367 కొండ దగ్గర బంధం అప్పారావు చేలు దగ్గర, బంగారు మాంబ గుడి సమీపంలోని మాజీ సర్పంచ్ చేలు దగ్గర పంచాయతీ బోర్లు వేయించారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు పొలం పక్కనే కొన్నేళ్ల క్రితం తాగునీటి బోర్లు వేయించారు. అయితే వాటి పక్కనున్న కొందరు ఆ బోర్లకు మోటారు బిగించుకుని తమ పంటకు నీటిని వాడుకుంటున్నారు. ఓ వైపు తీవ్ర తాగునీటి ఎద్దడి ఉన్నా అవేవీ లెక్కచేయకుండా నీరు పారించుకుంటున్నారు. దీంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వ బోరులకు మోటార్లు బిగించి నీటి చౌర్యానికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు

విశాలాంధ్ర - సబ్బవరం : మండలంలోని పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్థానిక ఎంఈఓ ఎస్. లక్ష్మణరావు మాట్లాడుతూ మండలంలోని సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రతిభ విద్యాలయం, మదర్ పబ్లిక్ స్కూల్, సన్ రిడ్జ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, రావులమ్మపాలెం జడ్.పి.హెచ్ స్కూల్ ఐదు కేంద్రాలలో 928 మంది రెగ్యులర్ గాను 12 మంది ప్రైవేటుగాను పరీక్షలకు ఆలోట్మెంట్ చేయగా, మొదట రోజు మదర్ పబ్లిక్ స్కూల్ లో ఇద్దరు, రావులమ్మపాలెం జడ్.పి.హెచ్ స్కూల్ లో ఇద్దరు విద్యార్థులు గైర్హాజరు అయినట్లు ఆయన తెలిపారు. పరీక్ష కేంద్రాలలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.ఎటువంటి మాస్ కాపీయింగ్, పేపర్ లేకేజ్లు జరగకుండా అన్ని చర్యలు తీసుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై మండల స్థాయి అవగాహన సదస్సు

విశాలాంధ్ర -యస్.రాయవరం : మండలంలోని ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సోమవారం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మండల వ్యవసాయ ఉద్యాన వెలుగు ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో 2025 ఖరీదు సంబంధించి ప్రణాళిక పై సమీక్షించారు. ఎంపీపీ చోడిపల్లి అప్పలరాజు మాట్లాడుతూ గ్రామాల్లోని రైతులకు ప్రకృతి వ్యవసాయంపై మరింత అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం అధికారులు ఖరీఫ్ పంటకు కావలసిన పీఎండీఎస్ కిట్లు తదితర వాటిపై చర్చించారు.ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారి సౌజన్య, వెలుగు ఏపీఎం శివప్రసాద్, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి విజేత, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.